పేదలపై దాష్టీకం !

- గుడిసెలు కూల్చేందుకు యత్నం
- పోలీసులు, మహిళల మధ్య వాగ్వాదం, తోపులాట
- పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం
- 12 గంటల పాటు ఉత్కంఠ, ఉద్రిక్తత.
- మహిళలను బలవంతంగా పోలీస్ వ్యాన్ ఎక్కించిన వైనం అడ్డుకున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెక్కాడితే కానీ డొక్కాడని పేదల గుడిసెలపై ఉరుములేని పిడుగులా పోలీసులు వచ్చి దాష్టీకానికి యత్నించారు. పోలీసుల బూట్ల చప్పుళ్లు, లాఠీల మోతలను గుడిసెవాసులంతా ఏకమై అడ్డుకున్నారు. పోలీసులను ఒక్క అడుగు ముందుకు వేయనీయకుండా కదంతొక్కారు. దాంతో పోలీసులకు, గుడిసె వాసులకు మధ్య ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు.. దొరికిన వారిని దొరికినట్టుగా మహిళలను లాక్కెళ్లి డిసిఎంలో ఎక్కించారు. అయినా వారు వెను తిరగలేదు. పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందితో వీరోచితంగా పోరాడారు. పోలీసు బలగాలను ఒక్క అడుగు కూడా ముందుకు వేయనీయకుండా గుడిసెల చుట్టూ కంచెలా నిలబడ్డారు. వేలాదిగా వచ్చిన గుడిసెవాసులు పోలీసులను ఎదిరించి నిలబడ్డారు. ఎమ్మెల్యే రావాలంటూ నినదించారు. ఈ ఘటన మంగళవారం ఉదయం మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ సమీపంలోని పేదల గుడిసెల వద్ద నెలకొంది.

మహబూబాబాద్ పట్టణం కురవి రహదారిలోని కలెక్టరేట్ సమీపంలో 251 సర్వే నెంబర్‌లోని 20 ఎకరాల్లో సిపిఎం ఆధ్వర్యంలో పేదలు మూడేళ్ల కిందట 2000 గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారు. గతంలో 20 సార్లు ఈ గుడిసెలపై పోలీసు, రెవెన్యూ, మున్సిపల్‌తో పాటు వివిధ డిపార్ట్‌మెంట్ వారు దాడి చేశారు. 21వ సారి మంగళవారం మరోసారి మహబూబాబాద్ సబ్ డివిజన్ పరిధి రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ సిబ్బంది సుమారు 300మంది.. పేదల గుడిసెలు కూల్చి వేయడానికి 10 ప్రొక్లైనర్లు, డోజర్లను పట్టుకొచ్చారు. అడ్డు వచ్చిన పేదలను అరెస్ట్ చేయడానికి పది డిసిఎంలు, పోలీసు వాహనాలు పోలీస్ సిబ్బందికి ఏమైనా గాయాలు అయితే ఆస్పత్రికి తరలించడానికి అంబులెన్స్ కూడా తెచ్చుకున్నారు. ఉదయం ఆరు గంటలకు సుమారు 300 మంది ట్రాక్టర్లు, డోజర్లు, లాఠీలు ఆయుధాలు పట్టుకొని గుడిసెల వద్దకు వచ్చారు. వెంటనే అప్రమత్తమైన మహిళలు వారిని అడ్డగించి బైటాయించి ధర్నా చేశారు. పోలీసులు బలవంతంగా మహిళల్ని లాక్కెళ్లి డీసీఎంలో ఎక్కించి అరెస్ట్ చేయడానికి ప్రయత్నించారు. గుడిసెలు కూల్చేయడానికి సిద్ధమవ్వగా ఆగ్రహించిన ఐదుగురు మహిళలు లూనావత్ మంజుల, లకావత్ విజయ అరుణ, శిరీష, నీల పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేయగా.. పోలీసులు వెనక్కి తగ్గారు. డిసిఎం ఎక్కించిన మహిళలను వదిలివేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు వెనక్కి తగ్గారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉదయం 6:00 నుంచి సాయంత్రం 6 గంటలకు పోలీసు, రెవెన్యూ సిబ్బంది అక్కడే పడిగాపులు కాశారు. కాగా, గుడిసెలు కూల్చివేస్తున్నారన్న సమాచారం అందుకున్న సిపిఎం నాయకులు.. జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్‌ను కలిసి పేదల గూడును కూల్చొద్దని, వారికి గృహాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దాంతో కలెక్టర్ ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది వెనక్కి తగ్గారు.

మాజీ ఎమ్మెల్యే కబ్జా భూములు వెలికి తీయండి : సిపిఎం పట్టణ కార్యదర్శి బోనోత్ సీతారాంనాయక్

మహబూబాబాద్ పట్టణంలో 261, 251 సర్వే నెంబర్లలో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆకుల రాము, ఆకుల నవీన్, బినామీలుగా ఉండి కబ్జా చేసిన ప్రభుత్వ భూములను వెలికి తీయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్ డిమాండ్ చేశారు. పేదల గుడిసెలు కూల్చివేయడానికి వచ్చిన సిఐ దేవేందర్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. మహబూబాబాద్ పట్టణంలో మెడికల్ కాలేజ్ పక్కన మాజీ ఎమ్మెల్యే 45 ఎకరాలు ఆక్రమించుకున్నారని తెలిపారు. కలెక్టరేట్ సమీపంలో తొమ్మిది ఎకరాల్లో ఉన్న కుంటను మింగేశారని అన్నారు. మూడేళ్ల క్రితం రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బీఆర్ఎస్ నాయకులు, ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని వెంచర్లు చేసి అమ్ముతుండగా సిపిఎం వాటిని వెలికి తీసి పేదలతో గుడిసెలు వేయించారు. గుడిసెలు వేసుకున్న వారంతా పట్టణంలో వివిధ ప్రాంతాల్లో హమాలీలుగా, రోజువారి కూలీలుగా, అడ్డా కూలీలుగా పనిచేసుకుంటున్న వారే ఉన్నారని తెలిపారు. అలాగే, అందులో రెండు ఎకరాలను దోబీ ఘాట్‌లకు గత ప్రభుత్వం కేటాయించినట్టు గుర్తుచేశారు. మహబూబాబాద్‌లో వేలాది ఎకరాలు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని, ముందు వాటిని వెలికి తీయాలని కోరారు. పేదలకు పట్టాలు ఇవ్వాలని, ఇందిరమ్మ గృహాలు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు భానోత్ వెంకన్న, ఎండి రజాక్, మందుల మహేందర్, తోట శ్రీనివాస్, భూక్య రాజేష్ ప్రవీణ్, అన్వేష, శృతి నీలా, గోపిచంద్, జ్యోతి, బేబీ, అనూష తదితరులు పాల్గొన్నారు.

గతంలో 20 మంది జైలుకు, 200మందిపై బైండోవర్ కేసులు, అరెస్టులు

ఈ గుడిసెల ప్రాంతంపై గతంలో పోలీస్, రెవెన్యూ అధికార యంత్రం 20 సార్లు దాడి చేసింది. మూడు దఫాలుగా పేదలపై కేసులు పెట్టారు. రాత్రనక.. పగలనక.. దౌర్జన్యపూరితంగా గుడిసెలు కూల్చివేశారు. ఎన్నికలకు ముందు ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్.. గుడిసెలు పేదలకు ఇచ్చేటట్టుగా ప్రభుత్వం నుంచి అనుమతులు తెస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఈ ప్రాంతానికి చెందిన 10మంది మహిళలను రాత్రి పట్టుకెళ్లి అరెస్ట్ చేసి జైలుకు పంపారు. మరో పది మంది సిపిఎం నాయకులపై కేసులు పెట్టి జైలుకు పంపారు. సుమారు 200 మంది మహిళలు, పురుషులపై బైండోవర్ కేసు నమోదు చేశారు.

గుడిసెలు తొలగిస్తే ప్రజాప్రతిఘటన : జాన్‌వెస్లీ

గుడిసెలను తొలగిస్తే ప్రజాప్రతిఘటన తప్పదని సిపిఎం రాష్ట్ర కమిటీ హెచ్చరించింది. ఆ భూమిలో పేదల గుడిసెలను తొలగించి, పెద్దలకు కట్టబెట్టే కుట్ర జరుగుతున్నదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని అక్కడ నివాసముంటున్న పేదలందరికీ పట్టాలిచ్చి, ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ గుడిసెలను తొలగించే ప్రయత్నం చేస్తే తీవ్ర ప్రజాప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాంటి చర్యలకు పూనుకోవద్దని సూచించారు.

సమస్య పరిష్కారానికి 'వేం' హామీ : వీరయ్య

మహబూబాబాద్‌లోని ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలు సాధించడానికి ఐక్యంగా పోరాడాలని, సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాదారు వేం నరేందర్ రెడ్డి హామీ ఇచ్చారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.నాగయ్య తెలిపారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లాలో గుడిసెవాసులను పరామర్శించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్, ఎంపీ బలరాంనాయక్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ గౌడ్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాహుల్‌గాంధీ సలహాదారు తావ్ దృష్టికి గుడిసె వాసుల పోరాటాన్ని తీసుకెళ్లామని, గుడిసె వాసులపై దాడి చేయొద్దని పోలీసులను వెనక్కి పిలవాలని కోరినట్టు తెలిపారు. వేం నరేందర్ రెడ్డి స్పందించి పోలీసులను వెనక్కి పిలవాలని కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు 20.19 కోట్లు విడుదల

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బేస్‌మెంట్ పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు రూ. 20.19 కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్టు రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటి విడతలో పైలెట్ ప్రాజెక్ట్ కింద మంజూరు చేసిన 70,122 ఇండ్లలో బేస్‌మెంట్ పూర్తి చేసుకున్న 2019 మందికి రూ.లక్ష చొప్పున రూ. 20.19 కోట్లను విడుదల చేశామని పేర్కొన్నారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆటంకం ఏర్పడకుండా నిధులు విడుదల చేస్తామని తెలిపారు. ఇప్పటికే 13,500 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయని మిగతా వాటి గ్రౌండింగ్‌ను కూడా వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. 12 మంది లబ్ధిదారులకు సిఎం రేవంత్‌రెడ్డి మంగళవారం రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేశారని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయానికి తావులేకుండా నాలుగు విడతల్లో లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాల్లోనే నగదును జమచేస్తామని చెప్పారు. బేస్‌మెంట్ తర్వాత రూ.లక్ష, గోడలు పూర్తయిన తర్వాత రూ.1.25 లక్షలు, శ్లాబ్ పూర్తిచేసుకున్న తర్వాత రూ.1.75 లక్షలు, ఇల్లు మొత్తం పూర్తయిన తర్వాత మిగిలిన రూ.లక్ష విడుదల చేస్తామని వివరించారు. నిర్మాణం పూర్తిచేసుకుంటే అధికారుల కోసం ఎదురుచూడకుండా లబ్దిదారులే ఫోటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసినా వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. కనీసం 400 ఎస్ఎఫ్‌టీకి తగ్గకుండా 600 ఎస్ఎఫ్‌టీకి మించకుండా లబ్దిదారులు ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు. అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మరింత వేగవంతం చేస్తామని చెప్పారు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమన్వయం ఉండేలా ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నామని తెలిపారు.

దమ్ముంటే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించండి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రజలను మోసం చేసి, అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ దమ్ముంటే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బిఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండల పరిధి శ్రీనివాస గార్డెన్‌లో జరిగిన తొర్రూరు పట్టణ బిఆర్ఎస్ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోనే పెద్ద మోసగాడని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిపినా బీఆర్ఎస్ 100 స్థానాలు గెలుస్తుందని జోస్యం చెప్పారు. ప్రజల్లో చైతన్యం వచ్చిందని, పోలీసులు, అధికారులు సైతం న్యూట్రల్ అయ్యారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని చెప్పారు. పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ మంజూరు చేసిన పనులన్నీ కాంగ్రెస్ పార్టీ పక్కన పెట్టిందని, రాజకీయాలు వేరు అభివృద్ధి వేరు అని అన్నారు. అధికారంలో లేకపోయినా భయపడేది లేదని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. ఈనెల 27న ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ సభలో అందరూ పాల్గొనేలా గత పదేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకుపోవాలని నాయకులకు దిశా నిర్దేశం చేశారు. తాను ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎక్కడ పోటీ చేసినా గెలుస్తానని తెలిపారు. అయితే పాలకుర్తిలోనే నిలబడి గెలిచి చూపిస్తానని సవాల్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు రామిని శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు పసుమర్తి సీతారాములు, మాజీ జడ్పిటిసి మంగళపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపిపి తూర్పాటిచ్చిన అంజయ్య, గాంధీ నాయక్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

వడదెబ్బ మరణాలకు ఎక్స్ గ్రేషియా రూ.4 లక్షలు

- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎండల మండుతున్నాయి. దీంతో వడగాలుల సమస్యపై కార్యాచరణ ప్రణాళికను జారీ చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. దీంతో పాటు తీవ్రమైన ఎండలు, వడగాలులు, వడదెబ్బ వంటి కారణాలతో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రస్తుతం ఇస్తున్న ఎక్స్‌గ్రేషియాను రూ.50 వేల నుంచి రూ.4 లక్షలకు పెంచింది. ఈ మేరకు మంగళవారం రెవెన్యూ(డిజాస్టర్ మేనేజ్‌మెంట్) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్విందర్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వడగాలులను భారత వాతావరణ శాఖ (ఐఎండీ) నిర్దేశించిన మేరకు గుర్తిస్తారు. వడదెబ్బ మరణాలను గుర్తించేందుకు జిల్లాల్లో డిఎంహెచ్ఒ, సంబంధిత మెడికల్ ఆఫీసర్, ఎంఆర్ఓ, పోలీస్ ఆఫీసర్, జిల్లా కలెక్టర్ వరకు చేయాల్సిన విధులను నిర్దేశించింది. మరణించిన వ్యక్తి అప్పటికే రైతు బీమా స్కీం కింద నమోదై ఉంటే బీమా, ఎక్స్‌గ్రేషియా రెండింటిలో ఒక దానికే అర్హత ఉంటుంది. అయితే రెండింటిలో ఎక్కువ మొత్తం వచ్చే దానిని మరణించిన వ్యక్తి కుటుంబానికి అందజేస్తారు.

కాళేశ్వరం సరస్వతి పుష్కరాల యాప్, వెబ్ పోర్టల్ ఆవిష్కరణ

- ప్రారంభించిన మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలోని భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో మే 15 నుంచి 26 వరకు జరగనున్న సరస్వతీ పుష్కరాలు, ఏర్పాట్ల వివరాలు భక్తులకి సమగ్రంగా తెలిపేందుకు సంబంధించిన వెబ్ పోర్టల్, మొబైల్ యాప్‌ను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మంగళవారం సచివాలయంలో ప్రారంభించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, ధార్మిక పరిషత్ సలహాదారులు గోవింద హరి, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఆలయ ఈవో మహేష్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ..పుష్కరాల కోసం స్నాన ఘాట్ల విస్తరణతో సహా వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో గతంలో సరస్వతి పుష్కరాలు నిర్వహించామని గుర్తుచేశారు. ఈ సారి కూడా తమ ప్రభుత్వానికే అవకాశం వచ్చిందని తెలిపారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ…తమ ప్రభుత్వం దేవాలయాల విషయంలో చాలా క్రియాశీలకంగా పని చేస్తున్నదన్నారు. గత ప్రభుత్వం దేవాదాయ శాఖ సంబంధిత వ్యవహారాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తాను దేవాదాయ శాఖ మంత్రి అయ్యాక సమ్మక్క సారక్క జాతర, కొమురవెల్లి కళ్యాణం, భద్రాచలం కళ్యాణం తదితర కార్యక్రమాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్టు వివరించారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చేసినట్టు వివరించారు. యాదగిరిగుట్ట దేవాలయానికి పాలక మండలి చట్ట సవరణ చేపట్టినట్టు చెప్పారు. సరస్వతీ పుష్కరాలకు రోజుకు 50 వేల నుంచి లక్ష దాకా వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. అక్కడ 17 అడుగుల రాతి సరస్వతి విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. చలువ పందిళ్ళ, శాశ్వత మరుగుదొడ్ల ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. వెబ్ సైట్, యాప్ ద్వారా అన్ని వివరాలు తెలుపుతామన్నారు. తమ ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్రీ బస్సు సౌకర్యంతో దేవాదాయ శాఖకు ఆదాయం పెరిగిందని చెప్పారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

సంస్కరణలతో అద్భుతమైన ఫలితాలు

గుజరాత్ పౌర సరఫరాల శాఖ ముఖ్యకార్యదర్శి రమేశ్ చంద్ర మీనా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్యక్రమంలో మాట్లాడుతున్న రమేశ్ చంద్ర మీనా

తెలంగాణ పౌరసరఫరాల శాఖ చేపట్టిన సంస్కరణలు అద్భుత ఫలితాలు సాధిస్తున్నాయని గుజరాత్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి రమేష్ చంద్ర మీనా అభినందించారు. రాష్ట్రంలో చేపట్టిన ఇ-పాస్ వ్యవస్థ విజయవంతమైందనీ, ప్రజా పంపిణీ వ్యవస్థ సమర్థవంతంగా పని చేస్తున్నదని కితాబిచ్చారు. ఇ-పాస్ సిస్టం ప్రజా పంపిణీ వ్యవస్థలో లోపాలను సరిదిద్దేందుకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో గతేడాది కాలంగా తీసుకొచ్చిన సంస్కరణలను అధ్యయనం చేసేందుకుగానూ ఆయన మంగళవారం రాష్ట్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ పంజాగుట్ట, ఏ.జి కాలనీలలోని జనపోషణ కేంద్రాలను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డిఎస్ చౌహాన్‌లతో కలసి ఆయన సందర్శించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలను స్వాగతిస్తున్నట్టు తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా నిరుపేదలకు ఉచితంగా అందిస్తున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం అద్భుతమని ఆయన ప్రశంశించారు.

తెలంగాణా రాష్ట్ర బియ్యానికి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రోజు రోజుకు పెరుగుతున్న డిమాండ్ ఆహ్వానించదగిందనీ, అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం పిలిప్పీన్‌కు బియ్యం ఎగుమతికి ఒప్పందం కుదుర్చుకోవడం అభినందనీయమని ఆయన కొనియాడారు. సన్న బియ్యం కొనుగోలులో క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించడంతో పాటు మహాలక్ష్మి పథకం కింద అర్హులైన ఎల్పీజీ లబ్దిదారులకు రూ.500 సబ్సిడీ అందించడాన్ని ఆయన ఆహ్వానించారు. ప్రజాపంపిణీ వ్యవస్థను పారదర్శకంగా నడిపించడంతో పాటు బలోపేతం చేసేందుకు తీసుకొచ్చిన సంస్కరణలు ధాన్యం కొనుగోలులో వచ్చిన మార్పులు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని రమేష్ చంద్ర మీనా వ్యాఖ్యానించారు.

టిశాక్స్‌లో నిబంధనలకు తిలోదకాలు

- ఇష్టానుసారంగా పోస్టుల భర్తీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదే పదే ఆరోపణలు, అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తమవుతున్నా తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీలో (టీశాక్స్) మార్పు రావడం లేదు. రాష్ట్రంలో హెచ్ఐవి ప్రబలకుండా నిరోధించే చర్యలతో పాటు ఆ వ్యాధి సోకిన రోగులకు సేవలందించేందుకు ఏర్పాటైన సొసైటీలో అధికారుల తీరు ప్రశ్నార్థకంగా మారుతోంది. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (నాకో) విధించిన నిబంధనలను బేఖాతరు చేసి తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. గతంలోనూ పోస్టుల భర్తీ, నిధుల దుర్వినియోగం తదితర ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. అదే క్రమంలో టీశాక్స్‌లో ఒక కీలకమైన హోదాలో నాకో నిబంధనలకు విరుద్ధంగా తమకు అనుకూలమైన వ్యక్తికి కట్టబెట్టినట్టు తెలుస్తున్నది.

టీశాక్స్‌లో ఉన్న పోస్టుల్లో కొన్ని రెగ్యులర్ పోస్టులు కాగా, మరికొన్ని పోస్టులు కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయాల్సినవి ఉన్నాయి. రెగ్యులర్ వారికి కేటాయించిన పోస్టులను వారితోనే, కాంట్రాక్ట్ వారికి కేటాయించిన పోస్టులను వారికే కట్టబెట్టాల్సి ఉంటుంది. నాకో మార్గదర్శకాల మేరకు ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ (ఐఇసీ) పోస్టులు కాంట్రాక్ట్ పరిధిలోకి వస్తాయి. నిబంధనలకు బేఖాతరు చేసి ఐఇసి జేడీగా రెగ్యులర్ ఉద్యోగికి అప్పజెప్పారు. ఎఒ ఇన్‌ఛార్జ్‌గాను కొనసాగిస్తున్నారు. ఇంతటితో ఆగకుండా మరో నాలుగు కాంట్రాక్ట్ పోస్టుల్లోనూ రెగ్యులర్ ఉద్యోగులనే డిప్యూటేషన్‌పై రప్పించడంపై టీశాక్స్ ఉద్యోగుల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కొత్తగా అధికారి వచ్చిన తర్వాత హెచ్ఐవి రోగుల కోసం వెచ్చించాల్సిన నిధులు దుర్వినియోగం అయినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు అధికారి డిప్యూటేషన్ ఫారెన్ సర్వీస్‌పై రావడమే కాకుండా తనకు అనుకూలంగా ఉన్న మరో నలుగురు రెగ్యులర్ ఉద్యోగులను టీశాక్స్ రప్పించుకున్నట్టు సమాచారం. కాంట్రాక్ట్ పోస్టుల్లో రెగ్యులర్ వారితో నడిపిస్తుండటంతో టీశాక్స్ ఆర్థికంగా నష్టపోతున్నదని ఉద్యోగులు చెబుతున్నారు. టీశాక్స్ పరిధిలోకాంట్రాక్ట్ ఉద్యోగులు పని చేస్తుండగా వారిని అవుట్‌సోర్సింగ్ చేసేందుకు కార్తికేయ ఏజెన్సీతో ఒప్పందం వెనుక కూడా నిబంధనలకు విరుద్ధంగా వచ్చిన అధికారి పాత్ర కీలకంగా ఉన్నట్టు సమాచారం. గతంలో ఎడి, డిడి పోస్టులను ప్రతిభ లేని వ్యక్తులకు కట్టబెట్టినట్టు వచ్చిన ఆరోపణల్లో ఈ అధికారి పేరు వినిపించడం గమనార్హం. నాకో అనుమతి లేకున్నా ఆదిలాబాద్ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ (సిపిఎం)గా ఒక వ్యక్తిని నియమించడమే కాకుండా ఆ వ్యక్తికి జీతం ఏ విధంగా ఇస్తున్నారో అర్థం కాని విచిత్ర పరిస్థితిని కల్పించారు. వైద్యారోగ్యశాఖలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని టీశాక్స్ ను ప్రక్షాళన చేయాల్సిన అవసరముంది.

జపాన్ పర్యటనకు సిఎం రేవంత్

- ఓసాకా వరల్డ్ ఎక్స్పో 2025లో తెలంగాణ పెవెలియన్ ప్రారంభం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రఅధికారులబృందంతో కలిసి ముఖ్య మంత్రి ఎ.రేవంత్‌రెడ్డి జపాన్ పర్యటనకు బయల్దేరి వెళ్లారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి బెంగుళూరు చేరుకుని, అక్కడి నుంచి విమానంలో బయలుదేరి బుధవారం ఉదయానికి జపాన్ చేరుకుంటుంది. ఏప్రిల్ 16 నుంచి 26 వరకు 7 రోజుల పాటు ఆయన పర్యటన కొనసాగుతుంది. టోక్యో, మౌంట్ ఫుజి, ఒసాకా, హిరోషిమాలో ముఖ్య మంత్రి బృందం పర్యటిస్తుంది. ఒసాకా వరల్డ్ ఎక్స్పో 2025లో తెలంగాణ పెవిలియన్‌ను ఆయన ప్రారంభించను న్నారు. ఆ దేశానికి చెందిన ప్రముఖ కంపెనీలు, పారిశ్రామిక వేత్తలు, పలువురు ప్రతినిధుల సీఎం బృందం సమావేశమవుతుంది. రాష్ట్రంలో పెట్టుబడులు, పారిశ్రామిక సాంకేతిక సహకారంపై చర్చలు జరుపుతుంది. కాగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సీఎంతో పాటు వెళ్లాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల ఒక రోజు ఆలస్యంగా గురువారం జపాన్ వెళ్లనున్నారు. ఏడు రోజుల పర్యటన ముగించుకుని ఒసాకాలోని కాన్సాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ నుంచి 22న బయల్దేరి 23న ఉదయం హైదరాబాద్‌కు చేరుకుంటారు.

ముఖ్యమంత్రి పర్యటన వివరాలు.

16 ఏప్రిల్, టోక్యో
జపాన్ చేరుకుంటారు (నారిటా ఎయిర్‌పోర్ట్)
భారత రాయబారితో ఆతిథ్య భేటీ.

17 ఏప్రిల్ (టోక్యో)
సోనీ గ్రూప్, జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ, జపాన్ బయో ఇండస్ట్రీ అసోసియేషన్, వివిధ సంస్థలతో సమావేశాలు, సాయంత్రం తోషిబా ఫ్యాక్టరీ సందర్శన

18 ఏప్రిల్ (టోక్యో)

టోక్యోలోని గాంధీ విగ్రహానికి పుష్పాంజలి, అనంతరం స్థానిక గవర్నర్‌తో భేటీ. ఇండియన్ ఎంబసీ అధ్వర్యంలో ఇండస్ట్రీ ప్రతినిధులతో సమావేశం, టయోటా, తోసిబా, ఐసిన్, ఎన్టీటీ తదితర కంపెనీల సీఈవోలతో వేర్వేరుగా సమావేశాలు. జపాన్ ఓవర్సీస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ ఫర్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రతినిధులతో సమావేశం, సుమిదా రివర్ ఫ్రంట్ సందర్శన

19 ఏప్రిల్‌న టోక్యో నుంచి ఒసాకామౌంట్ ఫుజి, అరకురయామా పార్క్ సందర్శన 20 ఏప్రిల్ (ఒసాకా)

కిటాక్యూషు మేయర్‌తో సమావేశం, ఎకో టౌన్ ప్రాజెక్టుకు సంబంధించిన సమావేశం, మురసాకి రివర్ మ్యూజియం సందర్శన. ఎన్విరాన్‌మెంట్ మ్యూజియం ఎకో టౌన్ సెంటర్ సందర్శన

21 ఏప్రిల్ (ఒసాకా)

యుమెషిమాలో వరల్డ్ ఎక్స్ 2025లో తెలంగాణ పెవిలియన్ ప్రారంభం, బిజినెస్ రౌండ్‌టేబుల్ సమావేశం

ఒసాకా రివర్ ఫ్రంట్ సందర్శన

22 ఏప్రిల్ (ఒసాకా, హిరోషిమా)

హిరోషిమా పీస్ మెమోరియల్ సందర్శన, గాంధీ విగ్రహానికి పుష్పాంజలి. స్థానికి వైస్ గవర్నర్, అసెంబ్లీ చైర్మెన్‌తో సమావేశాలు, జపాన్, ఇండియా చాప్టర్‌తో బిజినెస్ లంచ్. హిరోషిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సందర్శన, మజ్దా మోటార్స్ ఫ్యాక్టరీ సందర్శన.

పొలంలో నీళ్లుతాగి 56 గొర్రెలు మృత్యువాత

హైదరాబాద్ బ్యూరో : రోజువారీగా మేతకు వెళ్లిన గొర్రెలు.. నీరు తాగి మృత్యువాత పడిన ఘటన నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం హొన్నాజిపేట్ గ్రామంలో మంగళవారం జరిగింది. మొత్తం 56 గొర్ల మృత్యువాత పడ్డాయని, సుమారు రూ.5 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. ఘటనా స్థలాన్ని పశువైద్యాధికారి అభిషేక్ పరిశీలించారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కుర్మ పెద్దోళ్ల రాజయ్యకు చెందిన 16 గొర్రెలు, పెద్దోళ్ల గంప రాజయ్యకు చెందిన 41 గొర్రెలు, ప్రతిరోజులాగే గ్రామ సమీపంలోని అటవీప్రాంతానికి మేతకు తీసుకెళ్లారు. అక్కడే కోసిన పంట పొలాల్లోని బోరు మోటార్ వద్ద నీటిని జీవాలకు తాగించారు. నీరు తాగిన వెంటనే ఒక్కొక్కటిగా కిందపడ్డాయి. ఇలా మంద మొత్తం ఎక్కడికక్కడ పడిపోయి మృత్యువాత పడ్డాయి. గ్రామస్తులు పశువైద్యాధికారికి, తహసీల్దార్‌కు, పోలీసులకు సమాచారం అందించారు. అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. మిగిలిన వాటికి వైద్యం అందించారు. జీవాలు తాగిన నీటి శాంపిళ్ల సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు.

అంబేద్కర్, రాజీవ్‌ల వల్లే మహిళలకు విశిష్ట అధికారాలు

- గ్రీన్ పవర్ ఉత్పత్తిలో వారికి భాగస్వామ్యం
- స్త్రీ సమ్మిట్‌లో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో మహిళలకు విశిష్ట అధికారాలు, హక్కులు, రాజకీయాల్లో వాటాకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీయే పునాదులేశారని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం హైదరాబాద్ తాజ్ డెక్కన్‌లో జరిగిన స్త్రీ సమ్మిట్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో బాల్యవివాహాలు, వరకట్న నిషేధం, మహిళలకు ఓటు హక్కు, విడాకులు, ఆస్తిలో వాటా వంటి చట్టాలు హిందూ కోడ్ బిల్ ద్వారానే ఆచరణలోకొచ్చాయని వివరించారు. స్థానిక సంస్థల్లో 33శాతం మహిళలకు రిజర్వేషన్లను మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. ఆ చర్యల మూలంగా మహిళలు ఎన్నికలు, పరిపాలన రంగంలోకి ప్రవేశించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. రానున్న ఐదేండ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తుందని చెప్పారు. మొదటి ఏడాదే లక్ష్యానికి మించి రూ. 21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు స్వయం సహాయక సంఘాల మహిళలకు అందజేశామన్నారు.. రాబోయే నాలుగేండ్లలో ప్రతి ఏటా రూ.20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు అందజేస్తామని తెలిపారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన గ్రీన్ పవర్ పాలసీలో వారికి భాగస్వామ్యం కల్పించినట్టు తెలిపారు. సోలార్ ఉత్పత్తి రంగాల్లోకి వారిని తీసుకొస్తున్నట్టు వివరించారు. విద్యుత్ శాఖ, ప్రభుత్వంలోని ఇతర శాఖలు కలిసి స్వయం సహాయక సంఘాల మహిళలతో వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు. ఈ ప్రయోగం విజయవంతమయితే వారితో సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి బ్యాంకు లింకేజీ ద్వారా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయించి, ఖాళీ స్థలాలను ప్రభుత్వమే లీజుకిచ్చి, మహిళా సంఘాలు ఉత్పత్తి చేసిన విద్యుత్తును ప్రభుత్వమే కొనుగోలు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నామని వివరించారు. మహిళలు ఆర్థికంగా ప్రయోజనం పొందేందుకు ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రంలో ఉచితంగా ప్రయాణించే సౌకర్యం కల్పించినట్టు వివరించారు. ఈ సౌకర్యం ద్వారా మహిళలు హాస్టళ్ళలోని తమ పిల్లలను చూసేందుకు, మార్కెట్లు, దేవాలయాలను స్వేచ్ఛగా సందర్శించేందుకు అవకాశం ఏర్పడిందని వివరించారు. బ్యాంకు రుణాల ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలతో బస్సులు కొనుగోలు చేయించి వాటిని ఆర్టీసీకి లీజుకిచ్చి ఆర్థిక ప్రయోజనం పొందే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఆధునిక యుగంలోనూ నేటికీ బాల్య వివాహాలు, వరకట్న వేధింపులు కొనసాగుతున్నాయనీ,ఈ అంశంపై సమాజం మొత్తం ఆలోచన చేయాలని డిప్యూటీ సిఎం కోరారు. స్త్రీ సమ్మిట్ వంటి కార్యక్రమాలు ప్రజలను సన్మార్గంలో నడపడానికి, ప్రభుత్వాలు సరైన చట్టాలు తెచ్చేందుకు ఉపయోగపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు.

కోర్టు వారి ఉత్తర్వు మేరకు పత్రికా ప్రకటన

IN THE COURT OF THE FAMILY CUM VIII ADDL. DISTRICT JUDGE:ONGOLE

E.P No. 709/2022

Between
వేముల శ్రీకాంత్ ...... డి.హెచ్.ఆర్
And
కుంచాల వెంకటేశ్వర్లు మరియు ఇతరులు ...జె.ఆర్‌లు

To
2వ జె.డి.ఆర్
తన్నీరు సుబ్బలక్ష్మి W/o శ్రీనివాసరావు.
వయస్సు 48 సంవత్సరాలు, గృహిణి,
R/o ప్లాట్ నెం. 32, 2nd ఫేస్,
జె.పినగర్, తిరుమలగిరి,
మియాపూర్, హైదరాబాద్ -500049,
తెలంగాణా రాష్ట్రము. 10085

4వ జె.డి.ఆర్
బత్తుల సుజాత W/o రాంబాబు
వయస్సు 48 సంవత్సరాలు, గృహిణి,
R/o ప్లాట్ నెం. 32, 2nd ఫేస్, జె.పి.నగర్,
తిరుమలగిరి,మియాపూర్,
హైదరాబాద్ -500049, తెలంగాణా రాష్ట్రము.

పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు పై ఇ.పిలో 2వ మరియు 4వ జె.డి.ఆర్‌లు అయిన మీకు పై ఇ.పిలో నోటీసులు ఎన్ని పర్యాయములు పంపిననూ జారీ కానందున మీకు నోటీసు మరియు మీ హాజరు నిమిత్తమై పై కోర్టు వారు తే.24-04-2025 దికి పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసు కొరకు ఆర్డరు వేసియున్నారు. కావున తే.24-04-2025 దిన మీరు స్వయంగా గాని మీ న్యాయవాది గారి ద్వారా గాని పై కోర్టులో హాజరుపడి పై ఇ.పి విషయమై మీ ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకొనగలరు. లేని యెడల కోర్టువారు పైఇ.పిని మీపరోక్షములో విదారించి తీర్మానము చేయుదురని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

వాయిదా తేది- 24-04-2025
ఉదయం 10:30 గంటలకు.

ఇట్లు
విరిగినేని నరసింహారావు
జాజుల మాధురి,
కొమ్మాలపాటి ప్రమీల రాణి,
CH.బాబురావు, S. మమత,
P. వెంగళరావు
పిటిషనరు తరపు న్యాయవాదులు,ఒంగోలు
ఫోన్ : 9440077226

'ఉపాధి'కి తూట్లు పొడవడం దుర్మార్గం

- సిబ్బంది, కార్మికులకు మూడు నెలల వేతనాలు పెండింగ్‌లోనే : మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడిచేలా రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు వ్యవహరిస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధి కార్మికులతో సహా ఫీల్డ్ అసిస్టెంట్లకు, ఎపిఒలకు సిఒలకు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. చేసిన పనికి వేతనాలు రాక ఉపాధి కూలీలు, సిబ్బంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే, పస్తులతో కాలం వెల్లదీస్తుంటే ఈ ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరించడం దుర్మార్గమని తెలిపారు. మంత్రులను, అధికారులను కలిసి ఎన్నిసార్లు గోడు వెళ్లబోసుకున్నా ప్రయోజనం లేకపోవడం సోకాల్డ్ ప్రజాపాలన వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. జీతాల చెల్లింపుల విషయంలో సీఎం, మంత్రులు చెప్తున్న మాటలకు, చేతలకు ఎక్కడా పొంతన ఉండటం లేదనడానికి ఇది మరో ఉదాహరణ అని పేర్కొన్నారు. జీతాలు పెండింగ్‌లో పెట్టి రొటేషన్ చేస్తూ ప్రభుత్వాన్ని నడుపుతున్నామని సిఎం రేవంత్‌రెడ్డి చెబుతున్నారనీ, ఉపాధి కూలీల జీతాలను ఎవరి ఖాతాల్లోకి మళ్లిస్తున్నారని ప్రశ్నించారు. ఉపాధి హామీ చట్టం ఉద్యోగులకు తక్షణమే వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పిస్తామని అభయ హస్తం మేనిఫెస్టోలో చెప్పి ఏడాదిన్నర కావస్తున్నదని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో హామీలతో ఊదరగొట్టిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఏమని సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

వికలాంగ కొడుకుతో కలిసి బావిలో దూకిన తల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పుట్టు మూగతోపాటు మానసిక ఎదుగుదల లేని కొడుకుతో కలిసి తల్లి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల పరిధిలోని రామచంద్రనగర్ గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రనగర్ గ్రామానికి చెందిన బుడిగం వీరమ్మ (70), బిక్షమయ్య దంపతులకు ముగ్గురు కుమారులు. పదేళ్ల కిందట రెండో కుమారుడు చనిపోయాడు. చిన్న కుమారుడు నాగేశ్వరరావు పుట్టుకతోనే మూగ కావడం, మానసికంగా ఆరోగ్యం బాగా లేకపోవడంతో అన్ని సేవలూ తల్లే దగ్గరుండి చూసుకునేవారు. తనకు వయస్సు మీద పడటంతో తన తర్వాత కుమారుడిని ఎవరు చూస్తారని ఆందోళన చెందారు. చిన్న కొడుకుని తీసుకొని మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో బయటకు వెళ్లారు. గ్రామానికి చెందిన బుడిగం వెంకటేశ్వర్లు వ్యవసాయ బావిలో కొడుకును తోసేసి తానూ దూకేశారు. ఉదయం గ్రామస్తులు గమనించి చిలుకూరు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందజేశారు. ఎస్‌ఐ సురభి రాంబాబు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పెద్ద కుమారుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను కోదాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తెలంగాణలో వేగంగా విస్తరిస్తాం : కె2 జెనాక్స్

హైదరాబాద్ : టిఎంటి బార్ల (ఇంటెలిజెంట్ స్టీల్) తయారీదారు అయిన కె2 జెనాక్స్ తెలంగాణలో తన విస్తరణను వేగవంతం చేస్తోన్నట్లు ప్రకటించింది. రాష్ట్రంలో ఉక్కు ఉత్పత్తులకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడానికి ఏడాదిలో తన టిఎంటి బార్ ఉత్పత్తిని సామర్థ్యాన్ని 20 శాతం పెంచాలని యోచిస్తోన్నట్లు కె2 జెనాక్స్ డైరెక్టర్ సునీల్ అగర్వాల్ తెలిపారు. రాష్ట్రంలో మాసన్ మీట్, బిల్డర్ మీట్, తన ప్రత్యేక నిర్మాన్ కే షమూర్ వీర్ కార్యక్రమాల ద్వారా డీలర్లు, పంపిణీ నెట్‌వర్క్‌ను క్రమంగా విస్తరిస్తోన్నామన్నారు. వేగవంతమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి కలిగిన తెలంగాణ తమకు ముఖ్యమైన మార్కెట్ అని అన్నారు.

'ఉపాధి' నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

- రెండు నెలల వేతనాలు చెల్లించి, కార్మికులకు సౌకర్యాలు కల్పించాలి : నర్సింహులు
- కార్మికుల ర్యాలీ, ధర్నా
- సిపిఎం, ప్రజాసంఘాల నేతల మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధి పనుల నుంచి కార్మికులు, పేదలను దూరం చేసేలా ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నర్సింహులు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ బకాయిలు వెంటనే ఇవ్వాలని, పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలనే నినాదాలతో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ రెండు నెలలుగా ఉపాది హామీ కార్మికులకు డబ్బులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రూపాయలు మాఫీ చేస్తున్న ప్రభుత్వాలు ఉపాధి హామీకి రెండు లక్షల కోట్లు కూడా బడ్జెట్‌లో కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. చేసిన పనులకు ప్రతివారం పే స్లిప్పులు ఇవ్వాలని, దాంతో రోజు కూలి ఎంత వస్తుందనేది కార్మికులకు తెలుస్తుందని, ఎన్ని వారాల బకాయిలు తీసుకున్నారనే వివరాలు కూడా తెలుస్తాయన్నారు. ఝరాసంఘం మండలం బిడకన్న గ్రామంలో పనులు నిర్వహించి ఇంటికి వస్తున్న కూలీ మార్గమధ్యలో మరణించిందని, ఆ కూలీ కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు బి.రామచందర్ మాట్లాడుతూ.. ఏడాదిలో కార్మికులు అడిగినన్ని రోజులు పని దినాలు కల్పించాలన్నారు. పని ప్రదేశంలో ప్రమాదాలు జరిగితే ప్రయివేట్ హాస్పిటల్‌లో చూపించి, పూర్తిగా కోలుకునే వరకు సగం పేమెంట్ ఇవ్వాలని చట్టం చెబుతున్నా ఎక్కడా అమలు కావడం లేదని అన్నారు. బకాయి వేతనాలను వెంటనే ఇవ్వాలని, ప్రతివారం కూలీలకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి. జయరాజు మాట్లాడుతూ.. 2005లో యుపిఎ ప్రభుత్వ హయాంలో వామపక్షాల ఒత్తిడి మేరకే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం వచ్చిందన్నారు. నాటి నుంచి నేటి వరకు సిపిఎం ఉపాధి హామీ సమస్యలు వచ్చినప్పుడల్లా పోరాడుతుందన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి సాయిలు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎ మాణిక్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె రాజయ్య ధర్నాకు మద్దతు తెలిపి మాట్లాడారు. రెక్కాడితేగాని డొక్కాడని పేదలు, దళితులు కార్మికులుగా పని చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం పేదల నోటికాడి ముద్దను లాక్కునే ప్రయత్నం చేయడం సరైంది కాదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం చేస్తున్న పోరాటంలో సంఘీభావంగా నిలబడతామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు యాదగిరి, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు ఏసోబు, నాయకులు జి నర్సింలు, జి.రాజు, ఎం.రాజు, సుజాత, నర్సింలు, కుమార్, కృష్ణ, రాజేష్, నాగన్న, శ్రీనివాస్, లక్ష్మీ, జ్యోతి వివిధ గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

ఎసిబి వలలో జిహెచ్‌ఎంసి అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిహెచ్‌ఎంసి అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కారు. ఓ బాధితుని ఫిర్యాదు మేరకు మంగళవారం మధ్యాహ్నం శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఎసిబి సోదాలు చేపట్టింది. జోనల్ కార్యాలయంలోని అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ గదిలో రంగారెడ్డి జిల్లా ఎసిబి డిఎస్‌పి శ్రీధర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. శ్రీనివాస్ లంచం తీసుకుంటూ దొరికాడు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కొంతకాలంగా చాంద్రాయణగుట్ట సర్కిల్‌లో అర్బన్ బయోడైవర్సిటీ విభాగం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. చాంద్రాయణ గుట్ట సర్కిల్‌లో బయోడైవర్సిటీ కింద మొక్కలు సరఫరా చేసిన కాంట్రాక్టర్‌కు రావాల్సిన చెక్ క్లియర్ చేసేందుకు సదరు కాంట్రాక్టర్ వద్ద రూ.2.20 లక్షలు డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ వద్ద ఇది వరకే రూ.1.50 లక్షలు తీసుకోగా.. మిగిలిన రూ. 70 వేలను తీసుకుని శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయానికి మంగళవారం రావాలని సూచించారు. దాంతో కాంట్రాక్టర్ శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం వద్దకు వచ్చాడు. అయితే కాంట్రాక్టర్ వద్ద నుంచి డబ్బులు తీసుకుంటుండగా శ్రీనివాస్‌ను ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

కాగ్నిజెంట్‌తో సిటిజన్స్ ఫైనాన్సియల్ భాగస్వామ్యం

- హైదరాబాద్‌లో జిసిసి ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్

అమెరికా కేంద్రంగా పని చేస్తోన్న ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ సిటిజన్స్ ఫైనాన్సియల్ గ్రూప్ తమ ఆవిష్కరణల వేగవంతానికి కాగ్నిజెంట్‌లో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఆ సంస్థ ఎంటర్‌ప్రైజ్ టెక్నాలజీ వ్యూహాన్ని అమలు చేయడానికి వీలుగా హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబులిటి సెంటర్ (జిసిసి)ను ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. మంగళవారం దీనిని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. ఇది భారత్‌లోనే తన మొట్టమొదటి జిసిసి అని సిటిజన్స్ ఫైనాన్సియల్ వెల్లడించింది. దీని ద్వారా 1,000 కంటే ఎక్కువ ఉద్యోగాలు లభిస్తాయని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. కాగ్నిజెంట్ కొత్త జిసిసి సెంటర్ ద్వారా ఎంటర్‌ప్రైజ్ టెక్ సామర్థ్యాలు, కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ ప్లాట్‌ఫామ్‌లు, డేటా అనలైజ్, ఉత్పత్తి ఆవిష్కరణలను వేగవంతం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. నిజానికి ఇదొక ఇన్నోవేషన్ హబ్ మాదిరిగా పనిచేస్తుందన్నారు. సిటిజన్స్ బ్యాంక్, కాగ్నిజెంట్ చేతులు కలపడంతో, భారతదేశ జిడిపికి ఒక ట్రిలియన్ డాలర్లు అందించే మొదటి రాష్ట్రంగా అవతరించే లక్ష్యానికి తెలంగాణ దగ్గరగా ఉందని మంత్రి అన్నారు.

కోనోకార్పస్ మొక్కలతో నష్టం లేదు

- వాటివల్ల బహుళ ప్రయోజనాలు
- పర్యావరణవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు

సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కోనోకార్పస్ మొక్కలతో నష్టం లేదని, వాటి వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ప్రముఖ శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు చెప్పారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో 'కోనోకార్పస్ మొక్కలను రక్షించుకుందాం' అనే అంశంపై మీడియా సమావేశం నిర్వహించారు. జన చైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రముఖ వృక్ష శాస్త్రవేత్త, యోగివేమన విశ్వవిద్యాలయం మాజీ విసి, కోనోకార్పస్ మొక్కపై హెచ్‌సీయూలో పరిశోధనలు జరిపిన ప్రొ.ఎఆర్.రెడ్డి మాట్లాడారు. మొక్కలన్నిటిలో అత్యధిక కార్బన్ డై ఆక్సైడ్‌ను తీసుకొని అత్యధిక ఆక్సిజన్‌ను అందిస్తున్నది కోనోకార్పస్ అని తన పరిశోధనలో తేలిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా కోనోకార్పస్‌పై జరిపిన పరిశోధనల్లో వాటి వల్ల మంచి ప్రయోజనాలున్నాయని పేర్కొన్నారన్నారు. తక్కువ నీరున్నా బతుకుతుందని, తెలుగు రాష్ట్రాల్లో అపోహలను నమ్మి మంచి ప్రయోజనాలు గల కోనోకార్పస్ మొక్కలను తొలగించొద్దని విజ్ఞప్తి చేశారు. ప్రపంచంలో సగటున ఒక మనిషికి 421 మొక్కలు ఉండగా, బ్రెజిల్‌లో 500, అమెరికాలో 470, భారతదేశంలో కేవలం 28 మొక్కలు మాత్రమే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోనోకార్పస్ భూగర్భ జలాలను ఎక్కువ తీసుకుంటుందనే ప్రచారం అవాస్తవమని, నీటి లభ్యత లేని దుబాయ్, సౌదీ అరేబియాలో కోనోకార్పస్ మొక్కలను విరివిగా పెంచుతున్నారని తెలిపారు. కోనోకార్పస్ గుబురుగా పెరగడం వల్ల పక్షులు గూళ్లు పెట్టుకోలేవన్నారు.

సిసిఎంబి మాజీ డైరెక్టర్ డాక్టర్ సిహెచ్ మోహన్‌రావు మాట్లాడుతూ.. కోనోకార్పస్ వృక్షాల వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నట్టు పరిశోధన పత్రాలు పేర్కొన్నాయని తెలిపారు. ఈ చెట్లు జంతువులకు మేలు చేస్తాయని, హైవేలపై విషపూరితమైన వాయుకాలుష్యాన్ని తగ్గిస్తాయని చెప్పారు. ఈ చెట్ల ద్వారా సమకూరే నూనె కూడా ఔషధపరంగా ఉపయోగపడుతుందన్నారు.

జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కోనోకార్పస్ మొక్క ఆక్సిజన్ పీల్చుకొని కార్బన్ డై ఆక్సైడ్‌ను విడుదల చేస్తుందని పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. తెలుగు రాష్ట్రాలలో వాల్టా చట్టాన్ని అమలు చేయడం లేదని, చెట్లను నరికిన వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని అన్నారు. సుప్రీంకోర్టు ఇటీవల చెట్లను నరకడం మనుషులను నరికినట్టే భావించాలని తీర్పునిస్తూ ప్రతి నరికిన చెట్టుకు లక్ష రూపాయల పెనాల్టీ విధించిందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం కోనోకార్పస్ చెట్లను నరికే కార్యక్రమాన్ని కొనసాగిస్తే సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం వేస్తామన్నారు. మొక్కల మాఫియా అబద్ధాలను ప్రచారం చేస్తున్నదన్నారు. కోనోకార్పస్ విదేశీ మొక్క అని ప్రచారం చేస్తున్నారని, మన దేశంలో ఉన్న సగం మొక్కలు విదేశాల నుంచి వచ్చినవేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షులు, ఒయు వృక్ష శాస్త్ర ప్రొఫెసర్ బిఎన్ రెడ్డి, జీవశాస్త్ర నిపుణులు గోపాలకృష్ణ, విఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీల సంక్షేమ బోర్డు సాధనకు ఉద్యమం

- ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో హమాలీ కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రత కోసం హమాలీ ఫెడరేషన్ వెల్ఫేర్ బోర్డు సాధనకు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు అన్నారు. మంగళవారం సిఐటియు కార్యాలయంలో నాయకులు రాపర్తి రాజు అధ్యక్షతన నిర్వహించిన ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జనగామ జిల్లా విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఐదు లక్షల మంది వివిధ విభాగాల్లో హమాలీ కార్మికులుగా పనిచేస్తున్నారని అన్నారు. వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు అందడం లేదని తెలిపారు. దేశంలో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు, యాజమాన్యాలకు అనుగుణంగా కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని తెలిపారు. ఈ లేబర్ కోడ్‌లు కార్మికులకు తీవ్ర నష్టం చేస్తాయన్నారు. ఈ కార్మిక వ్యతిరేక కోడ్‌ల రద్దు కోసం మే 20న దేశంలో ఉన్న 11 కేంద్ర కార్మిక సంఘాలు జాతీయ సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని, హమాలీ కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పని చేసే హమాలీ కార్మికులకు రైతుల నుంచి కాకుండా ప్రభుత్వమే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం క్వింటాలుకు రూ.60 కూలీ నిర్ణయించినప్పటికీ అమలు జరగడం లేదన్నారు. ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన హమాలీ రేట్ల పట్టిక బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. తాడు కట్టినందుకు బస్తకు రెండు రూపాయలు చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని హమాలీ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆల్ హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి యాటల సోమన్న, సిఐటియు జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్, జిల్లా కోశాధికారి రాజు, జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాములు

సభలో మాట్లాడుతున్న సుదర్శన్

మనువాద ధోరణిలో మోడీ పరిపాలన

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మనువాద ధోరణిలో పరిపాలన కొనసాగిస్తున్నదని, పల్లెల్లో మతాల పేరుతో విభజన చిచ్చు పెడుతూ సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో కట్టంగూర్ మండల సమగ్రాభివృద్ధి కోసం చేపట్టిన ప్రజాపోరు యాత్ర సోమవారం రాత్రి ఇస్మాన్‌పల్లి గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. అణగారిన వర్గాల పోరాటానికి అంబేద్కర్ రచించిన రాజ్యాంగం స్ఫూర్తినిస్తోందన్నారు. మోడీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని, కనీస మద్దతు ధర కల్పిస్తామని, కనీస వేతన చట్టాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారని అన్నారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తెచ్చేందుకు ప్రయత్నించారని, రైతాంగ పోరాటంతో వెనక్కి తగ్గారని తెలిపారు.

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక వాగ్దానాలు, ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి విస్మరించారని అన్నారు. రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తానని చెప్పి వారితో బ్యాంకులో డబ్బులు కట్టించి ఇప్పుడు మాఫీ చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కట్టంగూరు మండలంలో 15 ఏండ్లుగా పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు కాలేదన్నారు. మండలంలో ప్రధాన నీటి వనరులైన ఆసిఫ్‌నగర్ కాలువకు మరమ్మతులు చేసి చెరువులు నింపాలని, బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు పూర్తిచేసి సాగు నీటినందించాలని డిమాండ్ చేశారు. ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, నాయకులు దండంపల్లి సత్తయ్య, పాదయాత్ర బృందం సభ్యులు పెంజర్ల సైదులు, చిలుముల రామస్వామి, జాల రమేశ్, గర్ల సతీష్ పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న టిపిఎస్‌కె నాయకులు

నృత్య కళలతో సాంస్కృతిక వికాసం

- మేలో 'సకల కళల నృత్య సమ్మేళనం'
- టిపిఎస్‌కె రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాట్య కళలు సాంస్కృతిక వికాసానికి పాదులు.. నాగరికతకు చిరునామాలని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. టిపిఎస్‌కె ఆధ్వర్యంలో భారతీయ నృత్య గురువుల సమావేశం మంగళవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో చినుకు కల్చరల్ సొసైటీ అధ్యక్షులు పిఎస్ మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సమావేశం భారతీయ నృత్యాలన్నిటినీ ఒకే వేదిక మీద ప్రదర్శించి సార్వత్రికతను చాటడం కోసమన్నారు. సామాజిక సాంస్కృతిక అంతరాలు, అడ్డంకులు దాటి సకల కళలు సామాన్యులకు దగ్గర చేయడం కోసమన్నారు. నృత్య గురువులను, శాస్త్రీయ నృత్యకారులను ఏకం చేయడం, ప్రజలకు, పిల్లలకు మంచి విలువలను అందించడం ఈ సకల కళల సమ్మేళనం ముఖ్య ఉద్దేశం అని చెప్పారు. నాట్యం గొప్ప శాస్త్రమని.. అది ఒక సముద్రం లాంటిదని అన్నారు. దాన్ని విశ్వ వ్యాపితం చేయాలనే ముఖ్య ఉద్దేశంతో టిపిఎస్‌కె ఆధ్వర్యంలో "సకల కళల నృత్య సమ్మేళనం" కార్యక్రమాన్ని మే మూడో వారంలో సుందరయ్య కళా నిలయంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మూర్తి మాట్లాడుతూ.. భారతీయ నృత్య రూపాలైన కథక్, కథాకళి, కూచిపూడి, భరతనాట్యం, మణిపూరి, మోహిని హట్టం, ఒడిస్సి సత్రియ పేరిణి, శివతాండవం, ఘూమాల్ బిహు, కోలాటం, పీర్ల పండుగ ఇలా అనేక కళారూపాలు ఒకే వేదిక మీద ప్రదర్శించడం గొప్ప అవకాశంగా గురువులు భావిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రీయ సంగీతం నృత్య గురువులు వరుణ్, కృష్ణ, పవన్, లావణ్య, యోగా టీచర్ రాధిక, శ్రీనివాస్, కూచిపూడి కె.రమాదేవి, భరతనాట్యం పి లక్ష్మీదేవి, కోలాటం గురువు అచ్చుతాంబ, సౌజన్య, నృత్య గురువు నిఖిలేష్, వెస్టర్న్ డాన్స్ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కస్తూర్బాలో విద్యార్థినుల ఆందోళన

- ఇంగ్లీష్ టీచర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమను నిత్యం వేధిస్తున్న ఇంగ్లీష్ టీచర్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ నాగర్కర్నూల్ జిల్లా మునిసిపాలిటీ పరిధిలోని నాగనూల్ కస్తూర్బా గాంధీ గురుకులం విద్యార్థినులు మంగళవారం ఆందోళన చేపట్టారు. పది రోజుల కిందట ఇంగ్లీష్ టీచర్ కల్యాణి వేధింపులు భరించలేక తొమ్మిదో తరగతి విద్యార్థిని చెయ్యి కోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. ఇప్పటి వరకు సదరు టీచర్‌పై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థినులు ఆందోళనకు దిగారు. కొద్దిగా ఆలస్యమైనా టీచర్ వేధిస్తున్నారని, చదవడం లేదని గొంతు పట్టుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెను సస్పెండ్ చేసే వరకు తరగతి గదికి వెళ్లబోమని మధ్యాహ్నం భోజనం కూడా చేయకుండా ఎండలోనే సుమారు మూడు గంటల పాటు బైటాయించారు. విషయం తెలిసిన వెంటనే విద్యార్థి, రాజకీయ పార్టీల నాయకులు అక్కడికి చేరుకుని వారికి సంఘీభావం తెలిపారు. ఇంగ్లీష్ టీచర్ కళ్యాణిని వెంటనే సస్పెండ్ చేయాలని ఐద్వా రాష్ట్ర నాయకులు కందికొండ గీత డిమాండ్ చేశారు. ఆమెను సస్పెండ్ చేసే వరకు నిరసన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఆలస్యంగా వస్తే మూడు గంటలపాటు తాగునీరు ఇవ్వకుండా, కనీసం టాయిలెట్స్‌కు పోనివ్వకుండా హింసించడం సరికాదన్నారు. వేధింపులు భరించలేక ఓ విద్యార్థిని బ్లేడ్‌తో చెయ్యి కోసుకోవడం బాధాకరమన్నారు. ఈ విషయంపై ఫోన్ ద్వారా డీఈవోని సంప్రదించగా.. తాను షోకాసు నోటీసులు పంపించాను.. సస్పెండ్ చేసే అధికారం తన వద్ద లేదని, కలెక్టర్ పరిధిలో ఉందని తెలిపారు.

దళిత శ్రామిక చైతన్యం అంబేద్కర్ ఆశయం

ప్రజాశక్తి - కల్చరల్

దళితులకే కాక శ్రామికులకూ చైతన్యవంతమైన జీవితం ఉండాలన్న ప్రణాళికలను రూపొందించిన మహనీయుడు బిఆర్ అంబెద్కర్ అని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికపై గాన సభ అధ్యక్షుడు కళా విఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన ప్రముఖ రచయిత జయసూర్య రచించిన భారతరత్న బాబాసాహెబ్ బిఆర్ అంబెద్కర్ జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య కొలకలూరి ఇనాక్ పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రసంగించారు. అంబెద్కర్ కేవలం దళితుల పక్షపాతి అనుకుంటారని కానీ భారతీయులలో చైతన్యం తీసుకురావడానికి జన మందరిని ప్రేమించిన వ్యక్తిగా ఆయనను గుర్తుంచుకోవాలని అన్నారు. మనిషి ఉన్నంతంగా ఎదగాలని ఆకాక్షించారని, అంత అద్భుతమైన వ్యక్తిని అర్ధం చేసుకోవడంలో ప్రజలు కూడా ఇబ్బందులు పడ్డ సందర్భాలు కూడా ఉన్నాయని అన్నారు. 1951 సంవత్సరంలో నాడు న్యాయశాఖ మంత్రిగా ఉన్న సమయంలో స్త్రీలకు మేలు చేసే హిందూ కోడ్ బిల్లు కు, తిరిగి ప్రాణం పోస్తేనే అంబేద్కర్‌కు నిజమైన నివాళని అన్నారు. . ఈ కార్యక్రమంలో సంఘ సేవకులు భవాని శ్రీనివాస్, కోళ్ల సుధాకర్, పాత శివ కుమార్, వీణాపాణి దితరులు పాల్గొన్నారు.

కెపిఎంజితో ఇథేమ్స్ బిజినెస్ స్కూల్ జట్టు

హైదరాబాద్ : కెపిఎంజితో జతకట్టినట్లు నగర కేంద్రంగా పనిచేస్తున్న ఫ్యూచరిస్టిక్ మేనేజ్‌మెంట్ స్కూల్ అయిన ఇథేమ్స్ బిజినెస్ స్కూల్ తెలిపింది. దీని ద్వారా తమ విద్యా నైపుణ్యాన్ని భారతదేశంలోని కెపిఎంజి పరిశ్రమ నైపుణ్యంతో మిళితం చేయనున్నట్లు పేర్కొంది. తద్వారా విద్యార్థులకు ఆచరణాత్మక, విద్యాదృఢత్వాన్ని అందించనున్నట్లు పేర్కొంది. ఈ ఒప్పందం భవిష్యత్తులో విద్యార్థులను ఉద్యోగాలకు సిద్ధం చేయడానికి, వారి కెరీర్‌ను ముందుకు నడిపించడానికి రూపొందించబడిందని కెపిఎంజి విద్యా, నైపుణ్యాభివృద్ధి హెడ్ నారాయణన్ రామస్వామి పేర్కొన్నారు.